
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 16 నవంబరు 2024



పేదల స్థలాలకు ఎసరు

పాతికేళ్ల క్రితం పచ్చి టెంకాయల వ్యాపారులకు పట్టాలు

- వైసీపీ హయాంలో నకిలీ పట్టాలు పుట్టించిన నాయకులు
- కోర్టు ఉత్తర్వులనూ ఖాతరు చేయని వైనం
- న్యాయం కోసం కలెక్టర్ వద్దకు బాధితులు



పచ్చి టెంకాయలను అమ్ముకుంటూ పొట్టపోసుకునే పేదలు వారు. నగరంలో దుర్భర జీవనం సాగిస్తుంటారు. సొంత ఇల్లు ఉంటే తమ కష్టాలు కొంతైనా తీరుతాయని భావించారు. అందరూ కలిసి సంఘంగా ఏర్పడ్డారు. అధికారులను కలిసి తమకు సాయం చేయాలని కోరారు. ఏళ్లు గడిచినా పట్టించుకోకపోవడంతో పోరాటాలకు దిగారు. దీక్షలు చేశారు. దీంతో అధికారులు దిగొచ్చి.. వారికి పట్టాలను ఇచ్చారు. స్థలాలను కేటాయించారు. కానీ నగరానికి దూరంగా, అసౌకర్యంగా ఉండటంతో ఇన్నాళ్లూ అక్కడికి వెళ్లలేకపోయారు. ఇదే అదనుగా వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు ఆ స్థలాను కాజేసేందుకు వ్యూహం పన్నారు. రెవెన్యూ శాఖలోని కొందరు అధికారుల సాయంతో పట్టాలు పుట్టించారు. రికార్డులలో వ్యాపారుల పేరున్నా.. ఆ స్థలాలు తమవే అని బెదిరింపులకు దిగుతున్నారు. కోర్టు ఆదేశాలు, కలెక్టర్ ఆదేశాలను ధిక్కరిస్తూ.. ఆ స్థలాలలోకి పట్టాదారులను రానివ్వడం లేదు. - ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

పాతికేళ్ల క్రితం పట్టాలు

అనంతపురం రూరల్ మండలం చిన్నపల్లి పంచాయితీ కురుగుంట సర్వే నంబరు 320-1లో పచ్చిటెంకాయల వ్యాపారులకు ఇంటి స్థలాలను ప్రభుత్వం ఇచ్చింది. 1999 ఫిబ్రవరి 1న 48మందికి అప్పటి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాతికేళ్లుగా పట్టాదారులు ఇళ్లను నిర్మించుకోలేదు. నగరం విస్తరణ నేపథ్యంలో అక్కడ సౌకర్యాలు మెరుగుపడ్డాయి. దీంతో నాలుగేళ్ల క్రితం ఇళ్లను నిర్మించుకునేందుకు ప్రయత్నించారు. కొవిడ్ ప్రభావంతో ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి. ఆ తరువాత వైసీపీ నాయకులు పట్టాదారులను అడ్డుకోవడం ప్రారంభించారు. ఆ స్థలాలు తమవని అంటున్నారు. వేరే పట్టాలను చూపిస్తున్నారు. దీంతో పట్టాలను పొందినవారు సంఘం ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లకు క్రమం తప్పకుండా అర్జీలు ఇస్తున్నారు. మూడు నెలల క్రితం కోర్టు కూడా వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా స్థలాలలోకి వెళ్లలేని పరిస్థితి. కూటమి అధికారంలోకి వచ్చాక బాధితులు మరోమారు స్థలాలలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ సాధ్యం కావడం లేదు. పార్టీ అధికారం కోల్పోయినా.. వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంలోని కొందరు నాయకులతో కలిసి పట్టాదారులకు చుక్కలు చూపిస్తున్నారు. రెవెన్యూ శాఖలోని కింది స్థాయి ఉద్యోగులు కొందరు వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారు.

తహసీల్దారు నిర్ధారించినా..

పట్టాలు ఉన్నా తమను స్థలాలలోకి రానివ్వడం లేదని బాధితులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో సమస్యను పరిష్కరించాలని మండల రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ మోహన్‌కుమార్ పట్టాదారులను పది రోజుల క్రితం స్థలాల వద్దకు పిలిపించి మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. మొత్తం 48 మందికి పట్టాలు ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డులలో ఉందని తెలిపారు. ఆ స్థలాలు పచ్చి టెంకాయల వ్యాపారులవే అని నిర్ధారించారు. అయినా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారులు, చట్టం కంటే.. నాయకుల పెత్తనమే సాగుతోంది.



ఇటీవల వ్యాపార్థులకు సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు

పోరాటాలు చేసి...



ఇంటి స్థలాల కోసం చాలా పోరాటాలు చేశాం. వారంపాటు నిరాహార దీక్ష చేశాను. పోలీసులు దీక్ష భగ్నం చేసి ఆస్పత్రిలోకి తరలించారు. అప్పటి ఆర్డీఓ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అప్పటి తహసీల్దారు చంద్రమౌళి పట్టాలు ఇచ్చారు. రెవెన్యూ అధికారులు మా వద్దకే వచ్చి మరీ పట్టాలను అందజేశారు. ఇప్పుడు ఎవరో వచ్చి స్థలాలు మావంటే ఎలా వదులుకుంటాం..? వదిలే ప్రసక్తే లేదు.

- కాయల ఉత్తన్న, పచ్చి టెంకాయల వ్యాపారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఇన్ని ఇబ్బందులు వస్తాయనుకోలేదు...



నాకు 37వ నంబరు ప్లాటును మంజూరు చేశారు. కొవిడ్ సమయం నుంచి ఇల్లు నిర్మించుకుందామని ప్రయత్నాలు చేస్తున్నాం. ఎవరో ఒకరు వచ్చి అడ్డుకుంటున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలోని వారు అడ్డుకుంటున్నారు. ఇల్లు కట్టుకునేందుకు ఇన్ని ఇబ్బందులు వస్తాయని అనుకోలేదు. అధికారులే మాకు న్యాయం చేయాలి.

- శంకర్, టెంకాల వ్యాపారి

వ్యాపారులవే..



కురుగుంట సర్వే నంబరు 320-1లో టెంకాయల వ్యాపారులకు పట్టాలు ఇచ్చింది వాస్తవమే. వారు ఇటీవల ప్రజా సమస్యల పరిష్కర వేదికలో అర్జీ ఇచ్చారు. తమకు కేటాయించిన స్థలాలలోకి ఇతరులు వస్తున్నారని, సర్వే చేయించి స్థలాలకు హద్దులు చూపించి న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాలతో క్షేత్ర స్థాయికి వెళ్లాం. వ్యాపారులను పిలిపించి మాట్లాడాం. రికార్డులు పరిశీలించాం. మా రికార్డుల ప్రకారం 48 మంది వ్యాపారులకు 1999లో అప్పటి అధికారులు పట్టాలు ఇచ్చారు. ఇదే విషయాన్ని వ్యాపారులకు చెప్పాం.

- మోహన్‌కుమార్, తహసీల్దారు

పంట వర్షార్పణం

- కోత దశలో దెబ్బకొట్టిన వాన
- నేలకొరిగిన వరి, జొన్న, మొక్కజొన్న
- 1456.5 ఎకరాల్లో రూ.3.01 కోట్ల నష్టం

అనంతపురం అర్బన్/గార్లదిన్నె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పంటలు కోత దశలో ఉన్న సమయంలో వర్షాలు కురుస్తుండటంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. దీంతో 1456.5 ఎకరాల్లో రూ.3.01 కోట్ల విలువైన వరి, జొన్న, మొక్కజొన్న, అరటి, చామంతి పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖపరంగా పుట్లూరు, యల్లనూరు, నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాయదుర్గం మండలాల్లో 1450 ఎకరాల్లో రూ.2.95 కోట్ల విలువైన వరి, జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ఉద్యానశాఖ పరిధిలో పుట్లూరు మండలంలో 1.5 ఎకరాల్లో అరటి, ఐదు ఎకరాల్లో చామంతి దెబ్బతింది. తద్వారా రూ.6 లక్షల దాకా నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. గార్లదిన్నె మండలంలో వర్షానికి వరిపంట నేలమట్టమైంది. గార్లదిన్నె, కల్లూరు, మర్తాడు, కొప్పలకొండ, ఇల్లూరు, కేశవపురం తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గాలివానకు పంటలు నేలవాలిపోయాయి.



గార్లదిన్నె వద్ద దెబ్బతిన్న వరి పంట



పుట్లూరు మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట



బుక్కరాయసముద్రంలో దెబ్బతిన్న వరి పంట

మోస్తరు వర్షం

జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. పుట్లూరులో అత్యధికంగా 27.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. యల్లనూరు 24.8, అనంతపురం 23.2, శింగనమల 21.4, రాయదుర్గం, ఉరవకొండ 18.6, బుక్కరాయసముద్రం 18.2, డి. హిరేహాళ్ 17.8, నార్పల 16.8, తాడిపత్రి 16.2, గుమ్మఘట్ట 14.6, గుంతకల్లు 14.4, శెట్టూరు 14.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిలిగిన మండలాల్లో 12.4 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం వర్షం పడింది. అనంతపురం నగరంలో భారీ వర్షం, బెళుగుప్ప, గార్లదిన్నె, గుత్తి మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. పుట్లూరు, తాడిపత్రి, నార్పల, గుంతకల్లు, బొమ్మనహాళ్ తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ఏటా నష్టమే..



పంటలు సాగుచేసిన ప్రతి ఏడాదీ నష్టాలే చవిచూస్తున్నాం. ఇంకో పది రోజులుంటే వరిపంట కోత కోసే వాళ్లం. ఎకరాలకు రూ.30 వేలు ఖర్చు చేసి నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశాను. వర్షానికి పంట పూర్తిగా నేలవాలిపోయింది. తీవ్రంగా నష్ట పోయాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- గోసుల సుబ్బయ్య, మర్తాడు

నేలపాలైంది..



రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి వరిపంట పూర్తిగా నేలమట్టమైంది. ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని ఎకరానికి రూ.30వేలు ఖర్చు పెట్టి వరి సాగుచేశాను. పంటచేతి కొస్తే ఎకరానికి రూ.70 వేల వరకు ఆదాయం వచ్చేది. మరో పది రోజుల్లో కోత కోయాల్సింది. గాలివానకు నేలవాలిపోవడంతో తీవ్రంగా నష్ట పోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఆవుల శ్రీనివాసులు, కౌలురైతు, మర్తాడు

పరిహారం అందుతుంది..



వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాము. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు పరిహారం అందుతుంది. ప్రతి రైతూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని.. ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి.

- సోమశేఖర్, గార్లదిన్నె ఏఓ

పైసలిస్తేనే పని..!

కళ్యాణదుర్గం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో డబ్బులు ఇవ్వందే వైద్య సేవలు అందడం లేదు. కిందిస్థాయి ఉద్యోగుల చేయి తడిపితేగాని పనులు జరగడం లేదు. ఔట్ సోర్సింగ్ కింద ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు రోగి బంధువు నుంచి డబ్బు తీసుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం రోగి బంధువుల నుంచి అతను డబ్బు తీసుకుంటున్న దృశ్యాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేశారు. విషయం తన దృష్టికి వచ్చిందని వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న భారతి తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని అన్నారు. సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించామని, డబ్బులు అడుగుతున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు.



డబ్బు జేబులో పెట్టుకుంటున్న శ్రీనివాసులు

గిరిజనుల ముద్దుబిడ్డ బిర్సా ముండా: కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ముద్దుబిడ్డ భగవాన్ బిర్సాముండా అని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. కలెక్టరేట్‌లో బిర్సా ముండా జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల భూ హక్కుల కోసం చిన్న వయసులోనే పోరాడిన గొప్ప వ్యక్తి అని అన్నారు. అలాంటి మహనీయులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, దేశం, జాతి అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అన్నదాత భార్య ఆత్మహత్య

- సేద్యానికి రూ.25 లక్షల అప్పు
- నిలదీసిన రుణదాతలు
- అవమానంతో పురుగు మందు తాగిన జయలక్ష్మి

శింగనమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సేద్యపు అప్పులు రైతు భార్యను బలిగొన్నాయి. అప్పులవారు ఇంటిమీదకు రావడంతో అవమాన భారంతో సాకే జయలక్ష్మి(43) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నాయనవారిపల్లి గ్రామానికి చెందిన సాకే పుల్లయ్య, జయలక్ష్మి దంపతులు వ్యవసాయదారులు. వీరికి పది ఎకరాల పొలం ఉంది. మరికొంత భూమిని కౌలుకు తీసుకుని, దానిమ్మ, ఇతర పంటలను సాగు చేశారు. ఐదేళ్ల నుంచి దిగుబడులు సరిగా రాలేదు. దీనికితోడు బోరుబావులు ఎండిపోయాయి. పంటలను కాపాడుకునేందుకు 15 బోరు బావులను తవ్వించారు. ఈ క్రమంలో పుల్లయ్య ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.25 లక్షల వరకూ అప్పు చేశారు. పంటలు సరిగా పండకపోవడంతో సకాలంలో తీర్చలేకపోయారు. రుణదాతలు శుక్రవారం పుల్లయ్య ఇంటి వద్దకు వెళ్లారు. ఆయన లేకపోవడంతో భార్య జయలక్ష్మిపై ఒత్తిడి చేశారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి, శింగనమల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. శుక్రవారం రాత్రి ఆమె మృతి చెందారు. శింగనమల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జయలక్ష్మి (ఫైల్)

గోల్.. గోల్.. గోల్

- ఏకపక్షంగా సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు
- కర్ణాటక, తమిళనాడు జట్ల ఘన విజయం



7

వెలుగెత్తిన దీపాలు

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



6


దీపాలతో హారతులు..


హెచ్చెల్సీ వద్ద పూజలు..




చన్నీటి స్నానం..


గంగలో దీపాలు వదిలేస్తూ..

వెలుగెత్తిన దీపాలు



శివ శివా..

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం
శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

అనంతపురం కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను జిల్లా ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్నారులు, మహిళలు తమ భక్తిని ప్రమిదలుగా వెలిగించి కైలాసనాథుడిని ఆరాధించారు. హర నామ స్మరణతో ఆయా ఆలయాలు ప్రతిధ్వనించాయి. జిల్లాకేంద్రంలోని హెచ్చెల్సీ కెనాల్‌లో పలువురు మాలధారులు, మహిళలు వేకువజామునే చన్నీటి స్నానాలాచరించి, కార్తీక దీపాలను వదిలారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఉదయం నుంచి కాశీవిశ్వేశ్వరునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిళ్వార్చనలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగించారు. రాత్రికి స్వామివారికి దశహారతులు సమర్పించిన అనంతరం ఊయ్యాల సేవ నిర్వహించారు. నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా కార్తీక దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.


కార్తీక శోభ..


1వ రోడ్డు శివాలయంలో కార్తీక దీపోత్సవానికి పోటెత్తిన భక్తజనం


ఆరనీకుమా ఈ దీపం..


ఈశ్వరా.. పరమేశ్వరా..


అరవింద్‌నగర్ శివాలయంలో దీపాలు వెలిగిస్తూ..


గీతామందిర్‌లో క్షీరాభిషేకం..



శివకోటిలో శివలింగానికి హారతుల వెల్లువ.. దీపాలు వెలిగిస్తూ..

'మహాప్రస్థానం' ప్రారంభించిన ఎంపీ అంబికా


మహాప్రస్థానం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురంటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో మృతదేహాలను తరలించడానికి మంజూరైన మహాప్రస్థానం వాహనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ ఉన్నవాహనం పాతబడటంతో పాటు మృతదేహాలు తరలించడానికి పేదలు ఇబ్బంది పడుతుండటంతో గతంలో ఉన్న ఎంపీ తలారిరంగయ్య ఎంపీ నిధులు మంజూరు చేశారు. వాటితో కొనుగోలు చేసిన నూతన వాహనం శుక్రవారం ఆస్పత్రికి వచ్చింది. దాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని, ఆస్పత్రికి అవసరమైన సహకారం తాను అందిస్తానని ఆయన డాక్టర్లకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ నవీన్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణితో పాటు పలువురు డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సీడాప్ అధికారులు, ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు


113 మందికి ఉద్యోగాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు, సీడాప్ ఎల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీలో రిలేషన్‌షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 435మంది హాజరు కాగా...113మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు కాలేజి ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, సీడాప్ జేడీఎం సూర్యనారాయణ నియామకపత్రాలు అందజేశారు. ఎంపికైన వారు అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, కదిరి, పెనుకొండ, హిందూపురం, గోరంట్లలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీడాప్ ఏపీ చైర్మన్ దీపక్‌రెడ్డి, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ ఇన్‌చార్జ్ వెంకటేష్, సీడాప్ ట్రైనర్ నారాయణస్వామి, మునీంద్ర, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి
బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24లోపు అనంతపురంలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. బీసీలో 66 శాతం, ఎస్సీల్లో 20 శాతం, ఎస్టీల్లో 14 శాతం మందిని రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు బుక్కు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు ఫోన్ : 08554-275575, సెల్ : 7799043773కు సంప్రదించాలన్నారు.

టమోటా కిలో రూ.23



అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలి
పీఆర్టీయూ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, కరువుభత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, ప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి ఇతర నాయకులు మాట్లాడారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాల బకాయిలు తక్షణం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సంపాదిత సెలవుల నగదు జమ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన సొమ్ము వారి ఖాతాల్లో పడేలా చూడాలన్నారు. నెలవారీ ప్రమోషన్లు ఇచ్చి, హైస్కూళ్లలో ఖాళీ పడిన ప్రధానోపాధ్యాయ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీవో117 రద్దు చేయడంతోపాటు, 3,4,5 క్లాసులను హైస్కూళ్ల నుంచి పూర్వపు ప్రైమరీ స్కూళ్లకు పంపాలన్నారు. ఎంఈఓల మాదిరిగానే ప్రతి డివిజన్‌కు ఇద్దరు డిప్యూటీ డీఈఓలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకుల కేశవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, వేమారెడ్డి, రామ్మూర్తి, రామ్మోహన్‌రెడ్డి, ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

మత్తుతో జీవితాలు నాశనం

అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు
ఇప్పటికే 23మంది గుర్తింపు, 11 మందికి రిమాండ్
మత్తు నివారణ సమీక్షలో కలెక్టరు, ఎస్పీ


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు, ఎస్పీ

అనంతపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. మత్తు పదార్థాలను అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మత్తునివారణ జిల్లా కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు విక్రయించుకుండా, వినియోగించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కొన్ని కాలేజీలలో ప్రహరిక్లబ్‌లు ఫెయిల్ అయినట్లు ఎస్పీ చెబుతున్నారు. ఆవివరాలు ఎస్పీ నుంచి తీసుకొని ఆవిద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్యఅధికారిని కలెక్టరు ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ప్రహరి క్లబ్ నిర్వహించాలని, దీనికి డీవీఈఓ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించాలని సూచించారు. పిల్లలకు పుస్తకపఠనం, యోగా, క్రీడలు వంటి అంశాలపై ఆసక్తి పెంచేలా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు చూడాలని ఆదేశించారు. మత్తు వల్లకలిగే నష్టాలు, వాటిని అమ్మినా, వినియోగించినా చట్టపరంగా ఎలాంటి చర్యలు ఉంటాయో పిల్లలకు అవగాహన కల్పించాలని కలెక్టరు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో డ్రాపౌట్స్ వివరాలు పక్కా సమాచారంతో అందించాలని ఆదేశించారు. మత్తుకు బానిసైన వారికి వైద్యచికిత్సలు అందించడం కోసం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్‌సెంటర్‌లో అన్ని వసతులు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు అవసరమైతే జనరల్‌ఫండ్స్ కింద తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు కలెక్టరు సూచించారు.

● రెండు కాలేజీలు, 9మంది విద్యార్థుల గుర్తింపు: ఎస్పీ

జిల్లాలో మత్తు పదార్థాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ వెల్లడించారు. గత నెలలో ఐదు కేసులకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో కేసులో 20మందిని గుర్తించామని వీరిలో 11మందిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఇందులో రెండు కాలేజ్‌లకు చెందిన 9మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఆయాకళాశాలల యాజమాన్యాలకు వారి వివరాలు తెలియజేశామన్నారు. రెండురోజుల కిందట కూడా పాతూరు వన్‌టౌన్ పరిధిలో రెండు చిన్నప్యాకెట్లును గుర్తించినట్లు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు అమ్మినా, వినియోగించినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. సమీక్షలో ఆర్డీఓ వసంతబాబు, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, డీవీఈఓ వెంకటరమణానాయక్, డీటీసీ రసూల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఖుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్‌తో అనర్థాలు
అధికంగా వాడితే ప్రమాదమే
అవగాహన సదస్సులో వైద్యాధికారులు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యాధులు త్వరగా నయం కావాలని ఇష్టానుసారం యాంటీబయాటిక్ మందులు వాడితే అనర్థాలు అధికంగా ఉంటాయని వైద్యాధికారులు ప్రజలకు సూచించారు. జాతీయ నవజాత శిశుసంరక్షణ వారోత్సవాల సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, డీఐఓడాక్టర్ యుగంధర్, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నవజాతశిశువులు వ్యాధుల బారిన పడినపుడు ఆస్పత్రిలోని డాక్టర్లకు చూపించి, వారు ఇచ్చిన మందులను మాత్రమే వాడాలన్నారు. గర్భిణులు, బాలింతలు కూడా అధిక డోసేజ్ ఉన్న యాంటిబయాటిక్స్ మందులు వాడకూడదని సూచించారు. ఈ యాంటీబయాటిక్ మందుల వల్ల కలిగే అనర్థాలపై ఈనెల 21వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి తెగుళ్లు

పైరును ఆశించిన గులాబి రంగు చీడ
ఇళ్లలో నిల్వ ఉంచిన పత్తికి ఎర్ర పురుగు


ట్రాక్టరుతో పత్తి పంట తొలగింపు..


గులాబీ రంగు పురుగు ఆశించిన పత్తి కాయలు

గుత్తి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):పత్తికి గులాబీ రంగు చీడ ఎర్ర తెగుళ్ల పచ్చపురుగు ఆశించడంతో వందలాది ఎకరాలలో పంట నాశనమవుతోంది. వర్షం అధికం కావడంతో తెగుళ్ల సోకి పత్తి పంటను గుల్ల చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 1000హెక్టార్లలో పత్తి పంటను సాగుచేశారు. పత్తి పంటను వర్షాలకు అనుగుణంగా మూడు దఫాలుగా సాగు చేశారు. ఎకరాకు 15 వేల నుంచి 20 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. పంట సరిగా పండితే ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. తెగుళ్ల పంటను నాశనం చేస్తుండడంతో ప్రస్తుతం 3 నుంచి 5 క్వింటాళ్ల వరకూ మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కాయలలోకి గులాబీ రంగు పురుగు ప్రవేశించి నాశనం చేస్తుంది పురుగు నివారణకు పలు రకాల మందులు పిచ్చికారి చేసిన ఫలితం లేకుండాపోతుంది. రెండు సార్లు సత్తువ మందును విత్తారు. వర్షాలకు పత్తి పంట ఎర్ర తెగుళ్లలకు కాయలని నలపు, ఎరుపు రంగులో మారి పత్తి కాయలు పగలకుండ బుజు పట్టి నేల రాలి పోతున్నాయి. ఆగస్టు మాసంలో వర్షాలు రాక పోవడంతో పత్తికి ఉన్న పూత పిందేలు రాలి పోయాయి. ప్రస్తుతం పత్తి పంటకు తెగుళ్ల ఆశించడంతో ఈ ఎడాది ఆశించిన విదంగా పత్తి పంట రాలేదని రైతులు అంటున్నారు. పత్తిని తొలగించిన పంటను ఇళ్లలో ఉంచారు. నిల్వ ఉంచిన పత్తి పంటకు ఎర్రపురుగు ఆశించింది. వాటిని అమ్ముకొవాలంటే పత్తి తుకం తగ్గుతుందన్నారు.



తెగుళ్లు, చీడలతో నష్టపోయా

నేను 8 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశాను పత్తి పంటకు 5సార్లు మందు పిచికారీ చేశా. రెండుసార్లు సత్తవ మందు వేశాను ఇప్పటి వరకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టాను గులాబీ రంగు పురుగు, ఎర్ర ఎర్ర తెగుళ్ల సోకడంతో పంట దిగ్గుబడి తగ్గి పోయింది. వాటికి ఉన్న పత్తికాయలు నేల రాలుతున్నాయి. తెగుళ్లతో నష్ట పోతున్నాము.

- సూర్యనారాయణ, బేతాపల్లి

తెగుళ్లను నివారించవచ్చు

పత్తి పంటకు ఎర్ర తెగులు అశించి ఉంటే ఎకరానికి ఒక లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేపనూనె కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే 300 గ్రాముల థయోడికార్బ్ లేగా 500 ఎం.ఎల్ క్లోరోఫైరిపాస్ ఉదయం పూట పిచికారి చేయాలి. గులాబీ రంగు పురుగు ఆశించి ఉంటే ఎకరానికి 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. - వెంకటరాముడు, ఏడీఏ, గుత్తి

పత్తి దిగుబడి శూన్యం

నేను 5 ఎకరాలలో పత్తిపంట సాగు చేశాను. ఆగస్టు మాసంలో అరకొర వర్షం వచ్చింది. వర్షం వచ్చింటే పత్తి కొంత వరకు దిగుబడి వచ్చేది. వర్షం రాక పోవడంతో బేట్ట పోయి పత్తి చేట్టుకు ఉన్న పూత పిందేలు రాలిపోయాయి. ప్రస్తుతం వర్షలు ఎక్కువగా రావడంతో పత్తి కాయలు నల్లగా మారి పత్తి పగలకుండ బుజు పట్టి నల్లగా అయిపోలున్నాయి. ఈ ఎడాది పత్తి దిగుబడి శూన్యం. - రైతు రంగప్ప, బేతాపల్లి



క్రైం కార్నర్

బాలుడి నడుములో కొయ్య



అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

కణేకల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో రేగుపండ్ల కోసం చెట్టెక్కిన ఇర్ఫాన్ అనే బాలుడు ప్రమాదవశాత్తూ కింద పడ్డాడు. దీంతో విద్యార్థి నడుములోకి కొయ్య దూసుకెళ్లింది. కణేకల్లు తారకరామ్‌నగర్ కొట్టాలకు చెందిన దాదావలి కుమారుడు ఇర్ఫాన్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. గౌరమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం ఆప్షనల్ హాలిడే ఇచ్చారు. దీంతో ఇర్ఫాన్ స్నేహితులతో కలిసి రేగుచెట్టుపైకి ఎక్కి కాయలను కోస్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. చెట్టుకింద ఉన్న ఓ పదునైన కొయ్యపై పడటంతో నేరుగా ఇర్ఫాన్ నడుము భాగంలోకి దూసుకెళ్లింది. బాలుడి కేకలు విన్న స్థానికులు వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

కేబుల్ వైరు చోరీ



కేబుల్ వైరు చోరీ అయిన మోటర్

శింగనమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయనవారిపల్లిలో గురువారం రాత్రి 21 వ్యవసాయ మోటార్లకు చెందిన రెండు వేల మీటర్ల కేబుల్ వైరు చోరీ అయ్యింది. గ్రామానికి చెందిన గుత్తా ఆదినారాయణ మూడు మోటార్లు, సురేష్ 3, వెంకటనారాయణ 3, పాలరాజు 3, రామానాయుడు 3, బాలాజి 3, చాకలి రామాంజనేయులుకు చెందిన మూడు మోటార్ల కేబుల్ వైరును చోరీ చేశారు. ఒకే రోజు రాత్రి ఇన్ని మోటార్ల కేబుల్ వైరు చోరీ అవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ చోరీల విషయమై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

జడ్పీ సీఈఓకు అస్వస్థత



సీఈఓను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం విద్య, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ వెంకటసుబ్బయ్య అస్వస్థతకు గురయ్యారు. పని మీద శుక్రవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌కు వెళ్లారు. జిల్లా పరిషత్ ఉద్యోగ వర్గాల సమాచారం మేరకు సీఈఓ కలెక్టరేట్‌లో కొంత ఒత్తిడికి లోనైనట్లు తెలిసింది. అక్కడికి వెళ్లిన 15 నిమిషాలకు టెన్షన్‌కు గురికావడంతో అస్వస్థతకు గురైనట్టు తెలిసింది. దీంతో అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బీపీ ఎక్కువ ఉండటంతో వైద్య పరీక్షల అనంతరం సాయినగర్ 1వ క్రాస్‌లో ఉన్న మరో ప్రైవేట్ ఆస్పత్రిఇకి తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే వైద్య సేవలు అందించారు. తర్వాత కొంత ఉపశమనం పొందడంతో సాయంత్రం జడ్పీలోని అతిథి గృహానికి తరలించారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పలు విభాగాల ఉద్యోగులు ఆయనను పరామర్శించారు. మూడు రోజులపాటు విశ్రాంతి తీసుకోమని వైద్యులు సూచించినట్లు జడ్పీ వర్గాల సమాచారం.

డిసెంబరు 16లోగా చంపేస్తా..!



అనంతపురం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'డిసెంబరు 16వ తేదీ డెడ్‌లైన్..! ఆ లోపు నిన్ను చంపేస్తా' అని గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెసేజ్‌లు వస్తున్నాయని బాధితుడు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. నగరంలోని కురుబ గేరికి చెందిన నాగార్జున బంగారు నగల తయారీ పని చేస్తుంటాడు. రెండు వారాలుగా అతని మొబైల్ ఫోన్‌కు 9346726667 నంబరు నుంచి ఓ మెసేజ్ వస్తోంది. చంపేస్తామని బెదిరిస్తూ మెసేజ్ పంపుతున్నారు. ఆ నంబర్‌కు ఫోన్ చేసినా అతవలి వ్యక్తి స్పందించడం లేదని బాధితుడు వాపోయాడు. డిసెంబరు 16 డెడ్‌లైన్ అనడంతో ఆందోళన చెంది.. శుక్రవారం రాత్రి వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1052 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు 1052 క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా-2కు 978 క్యూసెక్కుల నీరు వెళుతోందని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.571 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గోల్.. గోల్.. గోల్..!

- ఏకపక్షంగా సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు
- కర్ణాటక, తమిళనాడు జట్ల ఘన విజయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంతోష్ ట్రోఫీ-2024 ఫుట్‌బాల్ పోటీలు ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలిండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే, జేసీ శివ నారాయణశర్మ, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ఈ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో తమిళనాడు జట్టు 7-0 గోల్స్ తేడాతో అండమాన్ నికోబర్‌పై విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో కర్ణాటక జట్టు 5-0 తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. రెండు మ్యాచ్‌లూ ఏకపక్షంగా సాగాయి. తమిళనాడు జట్టు ఆటగాళ్లు అలెగ్జాండర్ రోమియో, లీజో చెరో రెండు గోల్స్ కొట్టారు. విక్రం వెంకటాచలం, నందకుమార్ అనంతరాజ్ చెరో గోల్ కొట్టారు. అండమాన్ నికోబర్ జట్టు ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. కర్ణాటక ఆటగాడు అభిషేక్ శంకర్ పవార్ 3 గోల్స్, రుద్రవేద్, అశ్విన్ చక్రవర్తి చెరో గోల్ కొట్టారు. ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్టు ఒక్క గోల్ కూడా సాధించలేకపోవడం క్రీడాభిమానులను నిరుత్సాహపరిచింది. రెండు ఆటలకూ వర్షం కారణంగా పలుమార్లు అంతరాయం ఏర్పడింది. మ్యాచ్‌ల ప్రారంభానికి ముందు కళ్యాణ్ చౌబే మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన ఫుట్‌బాల్‌ను రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆర్డీటీ స్టేడియంలో క్రీడా సదుపాయాలు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నాయని అభినందించారు. సంతోష్ ట్రోఫీ పోటీలకు జిల్లా వేదిక కావడం శుభపరిణామమని జేసీ శివనారాయణ శర్మ అన్నారు. పోటీలను విజయవంతం చేయడానికి ఆర్డీటీతో కలిసి ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. అనంతపురాన్ని క్రీడా రాజధానిగా మార్చేందుకు కొత్త ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తామని కొత్త ప్రభుత్వం అన్నారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కల్యాణ్ చౌబే





వర్షంలోనే తలపడుతున్న ఆంధ్రా-కర్ణాటక జట్లు



ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జట్లతో అతిథులు



కుర్చీలు లేక నిలబడి మ్యాచ్ తిలకిస్తున్న విద్యార్థులు

ఎస్సీ వర్గీరణ చట్టం చేయాలి: ఎమ్మార్పీఎస్

అనంతపురం సెంట్రల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేసి తక్షణమే చట్టం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణకు కోర్టులో కేసువేసి గెలిచిన సభ్యులకు శుక్రవారం సత్కార మహాసభను నిర్వహించారు. మాదిగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహంవద్ద ఏర్పాటు చేసిన సభకు అక్కులప్ప అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు కృపాకర్ మాదిగ, ఆర్‌జే ప్రకాష్ మాదిగ, లాయర్ గిరిధర్ మాదిగ హాజరయ్యారు. వర్గీకరణ పోరాట ఉద్యమ గళాన్ని గ్రామీణ ప్రాంతాలనుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకు వినిపించారని కొనియాడారు. ఈ క్రమంలో ఎంతోమంది వృత్తి, ఉద్యోగ ఆదాయాలు, కుటుంబ జీవితాలను కోల్పోయారని అన్నారు. కలెక్టరేట్ వద్ద తెల్లబండ్ల రవి ఆత్మబలిదానం చేశారని గుర్తు చేసుకున్నారు. మాదిగ దండోరా ఉద్యమం ఎమ్మార్పీఎస్‌గా అవతరించి, వర్గీకరణపై ఉమ్మడి పోరాటాలు చేశామని అన్నారు. దండోరా ఉద్యమం వ్యవస్థలను కదిలించిందని అన్నారు. మాదిగల కోరిక న్యాయమైనదని, తీర్చాల్సిందేనని 1997లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ ప్రభుత్వానికి నివేదించిందని అన్నారు. మాదిగలకు హక్కులను కల్పించాల్సిందేనని మీడియా, రాజకీయపార్టీలు బలపర్చాయని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వర్గీకరణపై 2000లో అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారని, మాల సామాజిక ఎమ్మెల్యేలు కూడా ఓటువేశారని గుర్తుచేశారు. మాల సామాజికవర్గంలో పిడికెడు మంది మాత్రమే వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. అలాంటి వారి ప్రయత్నాలు విఫలమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ స్వామి, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న కృపాకర్ మాదిగ

తామరను తుంచండి

- మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మిరప పంటలో తామర పురుగు నివారణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 35 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మిరప పంటను సాగు చేశారన్నారు.పండిస్తున్నారన్నారు. మిరప పూతను నల్లతామర పురుగు ఆశించి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తోందన్నారు. మిరపతోపాటు మామిడి, మునగ, టమోటా, చిక్కుడు, దొండ, బండి, కాకర, బొప్పాయి, పత్తి తదితర పంటలను ఆశించిన విపరీతమైన నష్టాన్ని కలిగిస్తోందన్నారు. పొలంలో పంట లేని సమయంలో గడ్డి చామంతి, ఇతర గడ్డి జాతి మొక్కలు, వయ్యారి భామ తదితర కలుపు మొక్కలపై నివాసం ఉండి మిరపలో పూత దశ ఆరంభమైన సమయంలో ఆశించి రసం పీల్చడం ద్వారా పూత నుంచి పిందె ఏర్పడకుండా చేస్తుందన్నారు. తల్లి పురుగులు నలుపు రంగులో పువ్వులు, లేత ఆకుల మీద వ్యాపించి ఉంటాయన్నారు. మగ పురుగులు లేత పసుపు రంగులో పరిమాణంలో చిన్నవిగా తక్కువ సంఖ్యలో ఉంటాయన్నారు. నివారణ కోసం పంట మార్పిడి చేసుకోవాలన్నారు. వేసవిలో లోతుగా దుక్కులు చేసుకోవడం ద్వారా పురుగు కోశస్థ దశలను నివారించుకోవచ్చునన్నారు. పచ్చిరొట్ట పైరును వేసి భూమిలో కలియదున్నాలని సూచించారు. జీవన శిలీంధ్ర నాశని ట్రైకో డెర్మా విరిడి 2 కిలోలు, సుడోమోనాస్ 2 కిలోలు, మెటరిజియం 2 కిలోలతో వృద్ధి చేసిన ఒక టన్ను పశువుల ఎరువును, జీవన ఎరువులు అజాస్పిరిల్లుం, ఫాస్పో బాక్టీరియా, పొటాష్ బ్యాక్టీరియాను ఎకరాకు 2 కిలోల చొప్పున కలిపి భూమిలో కలియదున్నాలన్నారు. పంట చుట్టూ రెండు నుంచి మూడు వరుసలు రక్షక పంటగా జొన్న లేదా మొక్కజొన్న పంటలను వేసుకోవాలన్నారు. తామర పురుగు ఉధృతిని తట్టుకునే మన ప్రాంతానికి అనువైన హైబ్రీడ్ రకాలు వేసుకోవాలని సూచించారు.

పీఏబీఆర్‌లో మూడు టీఎంసీల నీరు



పీఏబీఆర్‌లో నీటి మట్టం

కూడేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు మూడు టీఎంసీలకు చేరాయి. తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్‌లోకి 258 క్యూస్కెల నీరు చేరుతోంది. డ్యాంలో శుక్రవారం 430.70 అడుగుల వద్ద 3.029 టీఎంసీల నిల్వలు నమోదయ్యాయని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. తాగు నీటి పథకాలకు 95 క్యూస్కెల నీటిని వదులుతున్నారు. ఇన్‌ఫ్లో తక్కువ ఉన్న కారణంగా నీటి మట్టం అంతంత మాత్రంగానే పెరుగుతోంది.

విద్యాసంస్థల్లో ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతి లేదు

కొత్తచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో రాజకీయ, మత, వివాహ తదితర ప్రైవేటు కార్యక్రమాలకు ఇక నుంచి అనుమతి ఉండదని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శుభకార్యాలు, రాజకీయ సమావేశాలకు అనుమతులు ఇచ్చేవారు. దీంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగేది. దీనిని నివారించేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడాన్ని రద్దు చేస్తున్నట్లు ఏడీ తెలిపారు.

వైసీపీ సోషల్ సైకో ఇంటికి నోటీసు

- నాలుగు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశాలు



అమర్‌నాథ్ రెడ్డి ఇంటికి నోటీసు అతికించిన పోలీసులు

కదిరి/అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరచెన్నయ్యగారిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అమర్‌నాథ్ రెడ్డి ఇంటికి విశాఖపట్నం వన్‌టౌన్ సీఐ దేవుడుబాబు శుక్రవారం నోటీసు అతికించారు. కదిరి అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌పై అమర్‌నాథ్‌రెడ్డి సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంతోపాటు గంజాయి ముఠాతో సంబంధాలున్నాయనీ, వీరే సూత్రధారులని అసత్య ప్రసారాలు చేశాడు. దీనిపై విశాఖ వన్‌టౌన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో విశాఖ పోలీసులు.. అమర్‌నాథ్ రెడ్డికి నోటీసులు ఇవ్వడానికి శుక్రవారం వీరచెన్నయ్యగారిపల్లికి చేరుకున్నారు. ఆ సమయంలో అతడు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు ఇవ్వబోగా వారు నిరాకరించారు. దీంతో నోటీసులు ఇంటికి అతికించారు. నాలుగురోజుల్లోగా సమాధానం ఇవ్వకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అందులో సీఐ పేర్కొన్నారు.

హక్కుల కోసం అలుపెరగని పోరాటం

- మజ్దూరు యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు



మాట్లాడుతున్న శంకర్‌రావు

గుత్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కారం, హక్కుల సాధనకు తమ యూనియన్ అలుపెరగని పోరాటాలు చేసిందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ జాతీయ కోశాధికారి సీహెచ్ శంకర్‌రావు పేర్కొన్నారు. స్థానిక రైల్వే డీజిల్ షెడ్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం షెడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 4నుంచి మూడు రోజుల పాటు జరిగే గుర్తింపు రైల్వే సంఘాల ఎన్నికల్లో మజ్దూరు యూనియన్ జెండా గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సీఅండ్‌డబ్ల్యు, కంట్రోలర్ లాబీ, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా పత్తికొండ రోడ్డు సర్కిల్‌లో మజ్దూరు యూనియన్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడ జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి డీజిల్ షెడ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజనల్ సెక్రెటరీ విజయ్‌కుమార్, కోశాధికారి శర్మ, ఏడీఎస్ నారాయణ, మజ్దూరు యూనియన్ నాయకులు నారాయణ, శేఖర్‌బాబు, రామాంజనేయులు రెడ్డి, మనోహర్, నరసింహ, సుదీర్, విశ్రాంతఅసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఊరికిచ్చిన మాట..!

- ఎన్నికల హామీకి కార్యరూపం
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం
- 'దుర్గం'లో పారిశుధ్య సమస్యకు చెక్
- ఎమ్మెల్యే అమిలినేని చొరవతో సాగుతున్న పనులు

కళ్యాణదుర్గం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో కూడాలేని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి మున్సిపాలిటీ అయిన కళ్యాణదుర్గంలో శ్రీకారం చుట్టారు. పట్టణంలో కొన్నేళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వాలు మారినా కళ్యాణదుర్గంలో డ్రైనేజీ వ్యవస్థను మార్చలేక పోయారు. చిన్నపాటి వర్షం వచ్చినా కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి గాంధీ సర్కిల్, టీ సర్కిల్ నుంచి మురుగు మొత్తం ప్రధాన దారి గుండా ప్రవహిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీన్ని గమనించిన అమిలినేని సురేంద్రబాబు తాను ఎమ్మెల్యేగా గెలిస్తే పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయిస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్అండ్‌బీ, మున్సిపాల్టీ అధికారుల సమన్వయంతో ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. పట్టణంలోని పాతబస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. పట్టణంలోని టీ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపునీరు చేరి ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా ఉండేవి. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి ప్రధాన రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఇందులో ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు భాగస్వాములై ప్రత్యేక నిధులు ఖర్చుచేయనున్నారు. మున్సిపాల్టీ నుంచి రూ. 3.5కోట్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఖర్చు చేయనున్నారు. ఎత్తు ప్రాంతంలో ఉన్న కోట వీధి నుంచి మురుగు, వర్షపునీరు వెళ్లేందుకు 400 మీటర్ల పొడవునా కాలువను నిర్మించనున్నారు. ఆ నీటిని నేరుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా విరక్తి గవిమఠం వద్ద కలుపుతారు. ఆ మురుగునీరు సాయిబాబా ఆలయం వద్ద ఉన్న కాలువ గుండా వెళ్లేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జనం ఎన్నుకున్న ప్రజాప్రతినిధికి విజన్ ఉంటే అభివృద్ధికి ఎలా అడుగులు పడతాయో అనేందుకు ఈ సంఘటన ఒక ఉదాహరణగా నిలుస్తోందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.



పట్టణంలోని గాంధీ సర్కిల్ ప్రధాన రహదారిలో పారుతున్న మురుగు నీరు



పట్టణంలోని పాతబస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి తవ్విన గుంత

ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతాం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి మురుగు సమస్యకు స్వస్తి పలకడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. కొన్నేళ్ల నుంచి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీన్ని గమనించి, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు పూనుకున్నాం. పాత బస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించి సజావుగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపడతాం. అభివృద్ధిలో ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతాం.

- అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

సంక్షిప్తం

దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ఏపీఆర్‌ఎస్ మైనార్టీ గురుకుల పాఠశాలలో తెలుగు (టీజీటీ) ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అంజినేయులు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉందన్నారు. బీఈడీ పూర్తి చేసి తెలుగు మెథడాలజీ లేదా భాషా ప్రవీణ ఉండాలన్నారు. వేతనం రూ. 14,800 ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8712625062 నెంబరును సంప్రదించాలన్నారు.

ఇంటి కోసం ఆన్‌లైన్‌లో..

చెన్నేకొత్తపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని పేదలు ప్రభుత్వ గృహ మంజూరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ హరినాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించి వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు.

అవయవ దానానికి అంగీకారం



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న ఎండీ నాగభూషణం

అనంతపురం సెంట్రల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మరణాంతరం తన శరీర అవయవ దానానికి ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణం అంగీకారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలత, అనస్తీషియా విభాగాధిపతి నవీన్‌లకు ఒప్పంద ప్రతాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ నాయకులు రామకృష్ణ, శ్రీకాంత్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

అనంతపురం క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బైక్‌లు ఎత్తుకెళ్తున్న ఓ దొంగను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటకు చెందిన భూపతి అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతను చోరీల కేసుల్లో ఇదివరకు జైలుకెళ్ళొచ్చాడు. కొన్ని రోజుల క్రితం రామచంద్రనగర్‌లోని ఓ గుడి సమీపంలో బుల్లెట్ బైక్‌ను దొంగలించాడు. ఆ బైక్‌ను అమ్మేందుకు చంద్రబాబు కొట్టాల ఆటో సర్కిల్‌లో ఉండగా నాలుగో పట్టణ ఎస్ఐ రాంప్రసాద్, సిబ్బంది అతన్ని అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు పంపారు.

కోడిపందేలపై పోలీసుల దాడులు

అనంతపురం క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలో కోడి పందేలు జోరుగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం ఉప్పరపల్లి సమీపంలోని పొలాల్లో కోడి పందేలు ఆడుతున్నట్లు ఇటుకలపల్లి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసిన కోడిపందేలు ఆడేవారంతా పరారయ్యారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీంతో కోడిపందేలు ఆడేవారిని పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

పీఆర్సీపై కమిటీ వేయాలి

అనంతపురం విద్య, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీపై వెంటనే కమిటీ వేయాలని ఫోర్టో నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర చైర్మన్ హరికృష్ణ మాట్లాడుతూ... కరువుభత్యం బకాయిలు, గత పీఆర్సీ బకాయిల చెల్లింపులు త్వరగా చేయాలన్నారు. ఉపాధ్యాయులకు మేనేజ్‌మెంట్ల వారీగా పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ రుణాలు, ఆర్జిత సెలవుల మంజూరుకు వెంటనే చొరవ చూపాలన్నారు. తర్వాత ఇటీవల ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన గాండ్లపర్తి శివానందరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఫోర్టో జిల్లా చైర్మన్‌గా ఏపీ ఎస్‌పీఈఏ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులును, గౌరవాధ్యులుగా లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎంపికచేసినట్టు ఫోర్టో రాష్ట్ర చైర్మన్ హరికృష్ణ ప్రకటించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గార్లదిన్నె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. సరస్వతీదేవి చిత్రపటానికి పులమాల వేసి పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కుళ్లాయప్ప



కుళ్లాయప్పను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నార్పల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లికి చెందిన తలారి కుళ్లాయప్పకు వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రభుత్వం నియమించింది. కుళ్లాయప్ప 2014లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి 460ఓట్ల మెజార్టీతో గెలిచాడు. 2019-23 వరకు టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిగా పనిచేశాడు. గత పది సంవత్సరాలుగా మండల వాల్మీకి సంఘం నాయకుడిగా పని చేశాడు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి కేటాయించినందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, నాయకులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి, ఆలం వెంకటనరసానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. నార్పలలో టీడీపీ కార్యాలయం లో నాయకులు కుళ్లాయప్పను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగారెడ్డి, నాగార్జున, ఎర్ర నాగప్ప, చంద్రబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాలువలను తలపించిన రోడ్లు

● కాస్త వర్షానికే జలమయం ● రోడ్లపైకి మురుగునీరు ● వాహనదారులకు తిప్పలు





వర్షంతో రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్‌లో రహదారిపైకి నీరు రావడంతో వాహనదారుల అవస్థలు..



పొంగిపొర్లుతున్న మరువవంక మురుగునీరు



రహదారిపై ఇరుక్కుపోయిన ఆటో..

అనంతపురం క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఉదయం వాన కురిసింది. ఈ ప్రభావంతో నగర రోడ్లన్నీ కాలువలను తలపించాయి. మురుగు కాలువల్లోని మురుగంతా రోడ్లపై ప్రవహించింది. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల నుంచి గంటపాటు వర్షం కురిసింది. దీంతో కాలువల్లోని నీరు రోడ్లపైకి వచ్చింది. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందనే విషయం స్పష్టం చేసింది. నగరంలోని ప్రధాన రహదారులన్నీ నీటితో నిండాయి. ఇక్కడా ఇంజనీరింగ్ అధికారులు, పారిశుధ్యం విభాగం అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. కాలువలు శుభ్రం చేయకపోవడంతో ప్లాస్టిక్ సామగ్రి, చెత్తాచెదారం అంతా రోడ్లపైకి వచ్చి చేరింది. రోడ్లలో వర్షపు నీరు నిలబడకుండా చేయడంలో ఇంజనీర్లు ఘోరంగా విఫలమయ్యారు. శ్రీకంఠం సర్కిల్‌లో మరీ దారుణంగా తయారైంది. ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఓ బైక్‌లో ఇద్దరు వస్తుండగా గుంతలో బైక్ టైరు పడి కింద పడ్డారు. మరువవంకలో మురుగునీరు పొంగింది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం చిన్నపాటి చెరువును తలపించింది. సుభాష్ రోడ్డు, హౌసింగ్‌బోర్డు ప్రధాన రహదారులలో వర్షపు నీటితో రోడ్లలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు





కనకదుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం విజయవాడలోని కనకదుర్గమ్మను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దర్శించుకున్నారు. అనంతరం ఆమె గోశాలను దర్శించారు. అదే విధంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వచన మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేను ఆశీర్వదించి, ప్రసాదం అందజేశారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు





అలంకరణలో సత్యనారాయణస్వామి, వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో అనంతపురం అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి దేవాలయంలో స్వామివార్ల మూలవిరాట్‌లకు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. దాదాపు 300 జంటలు సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్, తిరువీదుల జగదీష్ కుమార్, రంగా వెంకటకృష్ణారెడ్డి, సందీప్, భక్తులు పాల్గొన్నారు.

బాలకృష్ణ అభిమానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న గౌసమొద్దీన్

అనంతపురం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బాలకృష్ణ అభిమాని మున్వర్‌కు నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌసమొద్దీన్ రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో ఎన్‌బీకే 109 సినిమా టైటిల్ టీజర్‌ను అభిమాన సంఘం నాయకులతో కలిసి ఆయన వీక్షించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మున్వర్‌కు ఆర్థిక సాయం చేశారు.

ప్రాంగణ నియామకాల్లో 22 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డు నందుగల శ్రీ బాలాజీ ఎంబీఏ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో నగిలిటీ అనే బహుళ జాతీయ కంపెనీలోని ఉద్యోగాలకు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. 150మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాత పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూ, బృంద చర్చలు అనంతరం 22 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ అభినందించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.2.50 లక్షలు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కంపెనీ అధికారి రఘురాజు, బాబాఫకృద్దీన్, శివకుమార్, విభాగాధిపతి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాజు రోడ్డు ఆర్యవైశ్య హాస్టల్లోని వృద్ధాశ్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జేసీ శివనారాయణశర్మ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రతి ఒక్కరు తమ వద్దనే ఉంచుకొని వారి బాగోగులు చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ తనయుడు అంబికా వీక్షిత్, వృద్ధాశ్రమం అధ్యక్షుడు నాగభూషణం, సభ్యులు వెంకటేషబాబు, సత్యరామ్, శివ, రామాంజినేయులు, శంకరప్ప పాల్గొన్నారు.

డీప్‌కట్‌ను పరిశీలించిన పరిటాల శ్రీరామ్



డీప్‌కట్‌ను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

నార్పల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంపెర గ్రామ సమీపంలోని హెచ్ఎల్‌సీ డీప్ కట్‌ను శుక్రవారం ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఏ ప్రాంతానికి రావాల్సిన నీరు ఆ ప్రాంతానికి న్యాయబద్ధంగా వినియోగించుకోవాని, రైతులు కూడా సమన్వయంతో వ్యవహరించి చివరి ఆయకట్టు వరకు నీరు వెళ్లే విధంగా సహకరించాలని తెలిపారు. ఆయనతో పాటు పలువురు రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయించండి

అనంతపురం క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లోని భాగాలను మరమ్మతులు చేయించాలని నగర కమిషనర్ నాగరాజు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ నగరంలోని టవర్‌క్లాక్, జూనియర్ కళాశాల కాంప్లెక్స్, పాతూరు, సాయినగర్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లను అధికారులతో కలిసి పరిశీలించారు. అందులోని షాపురూములపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారి నుంచి తక్షణమే అద్దెలు వసూలు చేయించాలని ఆదేశించారు. ఆయనతో పాటు అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఈఈ షాకీర్, ఏసీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



చైత్రేష్



పరిమళ



సంజీవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 20 నుంచి పటియాలాలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-19 జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి గోనుగుంట్ల పరిమళ ఏపీ రాష్ట్ర మహిళల జట్టు తరఫున, చైత్రేష్ పురుషుల జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈనెల 18 నుంచి చత్తీస్‌ఘర్‌లో నిర్వహించే ఎస్‌జీఎఫ్-17 నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. శుక్రవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు బాలికలను మధ్యలోనే బడి మాన్పించి పెళ్లిళ్లు చేసిన సంఘటనలు జరిగాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే బాలికల బాల్య వివాహాలను నివారించవచ్చునని పేర్కొన్నారు. శింగనమల నియోజకవర్గంలో వ్యవసాయరంగంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో తాగునీటి పథకాలను నిధులు కేటాయించాలని కోరారు. మూతపడిన లెదర్ పరిశ్రమను ప్రారంభిస్తే మూడు వేల ఎస్సీ కుటుంబాలకు ఉపాధి లభిస్తుందన్నారు.

మాదిగల సదస్సును జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఎఫ్ నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం అనంతపురంలో శనివారం నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లలిత కళాపరిషత్‌లో నిర్వహించే మాదిగల ఆత్మీయ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ మందకృష్ణ మాదిగ జిల్లాల వారీగా సభలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు నాగేంద్ర, శ్రీనివాసులు, నాగభూషణ, నారాయణస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

గురునానక్ మందిరంలో ఎంపీ ప్రార్థనలు

అనంతపురం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీకంఠం సర్కిల్ సమీపంలోని గురునానక్ మందిరంలో శుక్రవారం రాత్రి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నానక్ బోధనలు సత్యం, ధర్మం, ప్రేమపై నిలదొక్కుకునేలా ప్రేరణ ఇస్తాయని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో గురునానక్ సంఘం సభ్యులు సుందర్ సింగ్, గోవింద్ సింగ్, అర్జున్ సింగ్, శేఖర్ సింగ్, భక్తులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు







సిద్దరాంపురం ఆలయం వద్ద దీపోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు రామలింగారెడ్డి, రాప్తాడులో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, గార్లదిన్నెలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

బుక్కరాయసముద్రం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక పౌర్ణమివేడుకలను వైభవంగా జరుపుకున్నారు. స్థానిక ముసలమ్మ కట్ట వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దరాంపురం గ్రామంలో కాళభైరవ స్వామి ఆలయంలో కోటి దీపోత్సవం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

రాప్తాడు : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత కుటుంబ సభ్యులు శుక్రవారం రాప్తాడులోని నీలకంఠేశ్వరస్వామి, పార్వతి, గౌరమ్మ దేవాలయాలను సందర్శించి కార్తీక దీపాలు వెలిగించారు. పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ తిరుపాలు పాల్గొన్నారు.

గార్లదిన్నె : కార్తీక పౌర్ణమి సందర్భంగా గార్లదిన్నె, కోటంక, కనుంపల్లి, కల్లూరు, ఇల్లూరు, పెనకచెర్ల, మర్తాడు, తదితర గ్రామాల్లోని దేవాలయాలను గత రెండు రోజుల నుంచి విద్యుత్ కాంతులతో ప్రత్యేక అలంకరణ చేశారు. శుక్రవారం గార్లదిన్నె శివాలయం, కనుంపల్లి సత్యనారాయణస్వామి దేవాలయం, కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం, యర్రగుంట్ల, కల్లూరు, ఇల్లూరు, మర్తాడు తదితర గ్రామాల్లో ఆయా దేవాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు.

క్లుప్తంగా..

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) :మండలంలోని ఎంగిలిబండ గ్రామాశివారులో గల 67వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. టీ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కేశవ తన కుమారు సందీప్‌తో కలిసి బైక్ పై గుత్తి నుంచి తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఎంగిలిబండ గ్రామాశివారులోకి రాగానే బైకులో నుంచి సందీప్ ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాధితుడికి ఆర్థిక సాయం

గుంతకల్లు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పాతగుంతకల్లుకు చెందిన లింగన్న గాయపడ్డాడు, అతనికి శుక్రవారం ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాప అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15రోజుల క్రితం లింగన్న రోడ్డు ప్రమాదంలో గాయపడి కుడి కాలికి శస్త్ర చికిత్స జరిగిందన్నారు. అతను కోలుకోవడానికి కొంత సమయం పడుతున్న సందర్భంగా వారి కుటుంబానికి తమ వంతుగా రూ. 10వేలు ఆర్థిక సాయం అందజేశామన్నారు. సమితి సభ్యులు భాగ్యరాజు, లింగేశ్వర్, వెంకటేష్, భాస్కర్, పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బెళుగుప్ప, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తగ్గుపర్తిలో శుక్రవారం పల్లె పండుగ కింద మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ మౌనిక శుక్రవారం భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు వెంకటనాయుడు, రాధాకృష్ణ, జయరాములు, దామోదర, రఘు, గోపాల్, జయప్ప, సెక్రెటరీ శంకరయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలో చాబాల- ధర్మపురికి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం ప్రారంభించారు. ఏపీ గుంతల రహిత రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ.70లక్షల వ్యయంతో ఈ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్మాణాలన్నింటినీ గాలికి వదిలేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, రాంబాబు, మధు, లింగమూర్తి, పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు చేపట్టండి

కణేకల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద గల కేజీబీవీ లో అర్ధంతరంగా ఆగిపోయిన నాడు - నేడు పనులను పునః ప్రారంభించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో తహసీల్దార్ ఫణికుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు - నేడు పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనుక వెంటనే నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాబాఫక్రుద్దీన్, మహేంద్ర, ఆనంద్‌రాజ్ పాల్గొన్నారు.

పొలాల్లో కేబుల్ చోరీ

పుట్లూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం మళ్లీ చోరీ జరిగింది. వారం క్రితమే గుర్తు తెలియని దుండగులు పలువురి రైతుల పొలాల్లో బోర్ల వద్ద గల విద్యుత్ మోటార్ల కేబుళ్లను కత్తిరించుకుని చోరీ చేశారు. అది మరువకనే తాజాగా మళ్లీ ఐదుగురు రైతులకు చెందిన పొలాల్లో కేబుల్‌ను కత్తిరించి ఎత్తుకెళ్లారు. మడ్డిపల్లి గ్రామంలోనే సుమారు 20మందికి పైగా రైతుల పొలాల్లో కేబుల్ చోరీ చేయడం గమనార్హం. దుండగులు అరటి, చీనీతోటలను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. మూడురోజులక్రితం డీఎస్పీ వెంకటేశ్వర్లు స్వయంగా మడ్డిపల్లికి వచ్చి పరిశీలించి వెళ్లారు. అయినా దొంగలు మాత్రం అవేవీ ఖాతరు చేయడం లేదు.

కాంగ్రెస్ ఇన్‌చార్జిగా రాంభూపాల్ రెడ్డి



కళ్యాణదుర్గం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జిగా కంబదూరు మండలం వెంకటంపల్లికి చెందిన రాంభూపాల్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సహకార సంఘాన్ని బలోపేతం చేద్దాం

కళ్యాణదుర్గం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాన్ని బలోపేతం చేసే దిశగా ప్రతి రైతు కృషి చేయాలని సహకార సంఘం సీఈఓ ముత్యాలప్ప కోరారు. కంబదూరులోని సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో తొలుత జెండాను ఆవిష్కరించారు. తర్వాత మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించడమే సహకార సంఘం ముఖ్య ఉద్దేశమన్నారు. సహకార సంఘాన్ని బలోపేతం చేస్తేనే ప్రతి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలి

కంబదూరు మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం వున్న ప్రతి ఒక్క రైతు ఈ కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేవైసీ చేయించుకునే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్ నకలుతో పాటు రెండు పాస్‌ఫోటోలను సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని చెప్పారు. ప్రతి ఒక్కరు గడువులోగా ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు

యాడికి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు ఒరిగింది. కాగా అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. యాడికిలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌కు చెందిన బస్సు శుక్రవారం సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద వదలడానికి స్కూల్ నుంచి బయలుదేరింది. కాగా పిన్నేపల్లిరోడ్డులో రివర్స్ చేసుకుంటుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో వెనుక వైపు ఉన్న గోతిలోకి వెళ్లింది. డ్రైవర్ అప్రమత్తతతో బస్సును అక్కడే నిలిపివేశాడు. గమనించిన స్థానికులు ఆ బస్సు వద్దకు వెళ్లి విద్యార్థులను కిందకు దింపారు. దీంతో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తల్లిదండ్రులు సంఘటనా స్థలికి వచ్చి తమ పిల్లలను తీసుకువెళ్లారు. ఈ సంఘటనపై పలువురు తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్ వద్దకు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. దీనిపై విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

గుంతల పూడ్చివేత

గుంతకల్లు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వినాయక ఘాట్ సమీపంలోని హైవే రోడ్డులో పడిన గుంతలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్ సిబ్బందితో పూడ్చివేశారు. రోడ్డులో గుంతలు పడిన విషయాన్ని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ప్రమాదాలు జరగకుండా గుంతలను పూడ్చివేయించారు.

శివోహం..

- ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- శివాలయాల్లో ప్రత్యేక పూజలు



తాడిపత్రిలో ప్రత్యేక అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు ఆలయాల్లో మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి దర్శనం చేసుకుని అర్చనలు చేయించారు. అలాగే ఆలయాల ప్రాంగణాల్లో కార్తీ క దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. మిగతా ఆలయాల్లోనూ కార్తీక పౌర్ణమి పూజలు జరిగాయి. కార్తీక దీప కాంతులతో ఆలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. పామిడి పట్టణంలోని బోగేశ్వరస్వామి ఆయలంలో లక్ష దీపారాధన నిర్వహించారు. అనంతరం జ్వాలాతోరణం కన్నులపండువగా జరిపారు. బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట గ్రామంలోని స్వప్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ధ్వజస్తంభంపై ఆకాశ దీపం వెలిగించారు. గుంతకల్లు పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో జ్వాలాతోరణాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వరాలయంలో ఆకాశదీపోత్సవం, జ్వాలాతోరణం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించారు.



గుంతకల్లులోని మార్కండేయ ఆలయంలో జ్వాలాతోరణం



పామిడి బోగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కూడేరులోని సంగమేశ్వరాలయంలో..

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

యల్లనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వర్షానికి మండలంలో వరి పంటలు దెబ్బతిన్నాయని, జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే సోదరి బండారు కిన్నెర హామీ ఇచ్చారు. మండలకేంద్రంలోని నేలకొరిగిన వరిపొలాలను, తడిసిన ధాన్యాన్ని శుక్రవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నష్టవివరాలను నమోదు చేయాలని వ్యవసాయ అధికారి రామకృష్ణకు సూచించారు. వ్యవసాయ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు రైతులకు అందుబాటులో ఉంచాలని డిప్యూటి తహసీల్దార్ రాజాకు తెలిపారు. అధికారులు పంటనష్ట వివరాలు అందించిన వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని అన్నారు. నివేదికల ఆధారంగా ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఆమె వెంట టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు దొడ్లో సుబ్బరాయుడు, మేడికుర్తి రామకృష్ణారెడ్డి, జంగంపల్లి సర్పంచు కుళ్లాయప్పనాయుడు, వెన్నపూసపల్లి భైరవేశ్వర్, చింతకాయమంద డిష్‌రాముడు, తిరుమలాపురం దస్తగిరి ఉన్నారు.



దెబ్బతిన్న వరిపొలాలను పరిశీలిస్తున్న బండారు కిన్నెర

240హెక్టార్లలో పంట నష్టం

పుట్లూరు: మండలంలో గురువారం కురిసిన గాలివానకు పలు గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కజొన్న, జొన్నపంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంట పూర్తిగా నేలకొరిగింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకటవేముల, కడవకల్లు, సూరేపల్లి, చింతకుంట, కందికాపుల గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్న 75మంది రైతులకు చెందిన 220హెక్టార్లు, జొన్నపంట 15మంది రైతులకు చెందిన 20హెకార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. అరకటవేములలో దెబ్బతిన్న పంటను శాస్త్రవేత్తలు నారాయణస్వామి, కిషోర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి కాత్యాయిని పరిశీలించారు. నష్టపోయిన పంటల నష్టాన్ని ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు.

ఘనంగా గౌరమ్మ ఉత్సవాలు

కణేకల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా గౌరమ్మ పండుగ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో సిద్ధప్పగుడి ఏరియా, నేసేపేట, కొత్తకొట్టాలతో పాటు మండలంలోని ఉడేగోళం, బ్రహ్మసముద్రం, మాల్యం, యర్రగుంట తదితర గ్రామాలలో ప్రజలు మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విడపనకల్లు: మండల కేంద్రంలో కడ్లే గౌరమ్మ రథోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో.. ప్రతి ఇంటి నుంచి ఆడపడచులు కలశాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. స్థానిక గౌరమ్మ బావికి వెళ్లి అక్కడి నుంచి గంగసమేతంగా గౌరీ దేవిని ఊరేగింపుగా తెచ్చి బసవేశ్వర ఆలయానికి చేర్చారు. శనివారం ఉదయం గౌరీ దేవిని ప్రతిష్ఠ చేయనున్నారు.



కణేకల్లులో ప్రతిష్ఠించిన గౌరమ్మ విగ్రహం

రాయదుర్గంరూరల్: పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో దేవరకొండ వంశస్థులు కేదారేశ్వరి గౌరీ వ్రతమును నిర్వహించారు. భక్తులు గౌరీ దేవిని ప్రతిష్ఠించి చక్కెరబొమ్మల హారతిని వెలిగించి పూజలు చేశారు.

సీఎస్ఐ చర్చి శత వార్షికోత్సవం

గుత్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చి శత వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభయ్యాయి. ముందుగా క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాయలసీమ అధ్యక్ష మండలం బిషప్ ఐజాక్ వరప్రసాద్, స్త్రీ మైత్రి రాయలసీమ అధ్యక్షురాలు సీడీ భారతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మహిళలు చెక్కభజనతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. తొలుత క్రైస్తవులు స్థానిక చర్చి వద్ద నుంచి మెయిన్ బజారులోని ఎన్టీఆర్ సర్కిల్, రాజీవ్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి అధ్యక్షుడు సల్మాన్,సెక్రెటరీ సురేంద్రబాబు, కోశాధికారి మనోరంజిత, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన

గుంతకల్లుటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వన్‌టౌన్ సీఐ మనోహర్, సబ్ రిజిస్ట్రార్ షామీర్ బాషా సూచించారు. పట్టణంలోని శంకరానందగిరి స్వామి జూనియర్ కళాశాలలో శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ మూడు నెలలకొసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్, జేవీవీ నాయకులు వినోద్‌కుమార్, షౌకత్‌అలీ, అధ్యాపకులు, పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

కూడేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూడేరు డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రకాష్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. సీపీఎం జిల్లా నాయకులు కృష్ణమూర్తి ,నాయకులు కరీం, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకి కేటాయించిన భూముల పరిశీలన

గుత్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి-పెండేకల్లు మధ్య ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు కింద చేపడుతున్న డబుల్ లేన్ పనుల కోసం చెట్నేపల్లి గ్రామ పొలాల్లో సేకరించిన భూములను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ శుక్రవారం పరిశీలించారు. అనంతరం జగనన్న లేఅవుట్‌ల వద్ద అహుడాకు కేటాయించిన భూములను కూడా పరిశీలించారు. రైల్వేకు ఎన్ని ఎకరాల భూమి కేటాయించారనే వివరాలను తహసీల్దార్ ఓబులేసును అడిగి తెలుసుకున్నారు. సర్వేయర్ సాయి, ఆర్ఐ సందీప్, వీఆర్వో సురేంద్ర పాల్గొన్నారు.

ఊరి బాగు కోసం పాటుపడదాం

మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఊరు బాగు కోసం అందరం పాటు పడదామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఊరు బాగుండాలంటే చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఉండాలని సూచించారు. చెత్త ఎక్కడబడితే అక్కడ పడేస్తే.. వాటివల్ల ఎంతోమంది ఎన్నో రకాల ఇబ్బందులు పడతారని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు చెప్పినా ఎవరూ అర్థం చేసుకోవడం లేదని, అదే తనను బాధిస్తోందని వాపోయారు. జనవరి నుంచి చెత్త అలాగే పడేస్తే మొదటి ఆప్షన్ కొళాయి కట్‌చేయడం, రెండో ఆప్షన్ కరెంట్ కట్ చేయడం, మూడో ఆప్షన్ ఫైన్ వేయడం, నాలుగో ఆప్షన్ చెత్త ను మీ ఇంటిలోనే వేయడం, ఇవన్నీ కాదంటే తనను ఊరు విడిపించండి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఎక్కడబడితే అక్కడ వాహనాలను అడ్డగోలుగా నిలుపుతున్నారని, బీటెక్ చదివిన వారు కూడా అలాగే చేస్తున్నారంటే అర్థం లేకుండా పోతోందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుకన్నా ముందుగా క్రమశిక్షణ నేర్పించాలని హితవు పలికారు. డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన మహిళలకు పట్టణంలోని వద్ది షోరూం ఎదురుగా ఉన్న స్థలంలో స్టాల్స్ ఏర్పాటు చేస్తామని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఎవరైనా తీసుకొని బాడుగలకు ఇస్తే ఒప్పుకోమని అన్నారు. కేవలం మహిళలు ఆర్థికంగా అభివృద్ధిచెందడానికే ఈ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జేసీ పార్కు సమీపంలో కూడా స్టాల్స్ ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అహుడా చైర్మన్‌ను కలిసిన జనసేన ఇన్‌చార్జి

తాడిపత్రి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి అనంతపురంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



వరుణ్‌ను కలిసిన కదిరి శ్రీకాంత్‌రెడ్డి

ఘనంగా చల్లా సుబ్బరాయుడి జయంతి



చల్లా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

తాడిపత్రి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు 109వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని యల్లనూరురోడ్డు సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి చల్లా కుటుంబ సభ్యులతోపాటు టీడీపీ నాయకులు ప్రభాకర్‌నాయుడు, చల్లానూరి, ప్రసాద్‌నాయుడు, నరసింహులు, కొండారెడ్డి, వెంకటనాయుడు, నాగరంగయ్య, రాజా తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వాహనాల తనిఖీ

రాయదుర్గం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో రికార్డులు సక్రమంగా లేని 10 ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు సీఐ జయానాయక్ తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, అలాగే వాహనాలకు సంబంధించిన రికార్డులను కలిగి ఉండాలని సూచించారు. లేని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ఉరవకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మహబూబ్ బాషా హెచ్చరించారు. ఈ నెల11వ తేదీన ఆంధ్రజ్యోతిలో శివ శివా.. రూ. కోటి విలువ చేసే స్థలం కబ్జాకు యత్నం అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆస్థలాన్ని పరిశీలించి ఖాళీ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. శివరామిరెడ్డి కాలనీలో సర్వే నెంబర్‌లో 556లో 40సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నదని దీనిని ఎవరైనా ఆక్రమించినా, అక్రమ నిర్మాణం చేసినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు.



ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

లైన్‌మన్‌పై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

బెళుగుప్ప, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లపల్లిలో విద్యుత్ బిల్లు కట్టాలని అడిగినందుకు లైన్‌మన్ యల్లారెడ్డిపై అదే గ్రామానికి చెందిన ధనుంజయ దుర్భాషలాడుతూ దాడి చేశాడు. ఈ మేరకు విద్యుత్ అధికారులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుండ్లపల్లిలో గురువారం సాయంత్రం లైన్‌మెన్ విద్యుత్ బిల్లు చెల్లించాలని అడిగినందుకు ధనుంజయ గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో అతను చెప్పు కాలితో తన్నాడు. లైన్‌మెన్ విషయం ఉన్నతాధికారులకు తెలపడంతో విద్యుత్ ఏడీఏ గురురాజ్, ఏఈ గంగాధర పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ధనుంజయపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు.

న్యాయం చేయండి

బెళుగుప్ప, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ భూములను వైసీపీ ప్రభుత్వంలో ఓ వలంటీరు ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకుని బ్యాంకు రుణాలు పొందుతున్నారని, న్యాయం చేయాలంటూ మండలంలోని జీడిపల్లికి చెందిన బాధిత రైతులు ఎర్రక్క, సురేష్, నారాయణ స్వామి అధికారులను కోరారు. మండలకేంద్రంలో శుక్రవారం వారు తహసీల్దార్ షర్మిలను కలిసి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో ఓ వలంటీరు తమకు చెందిన కొంత భూమిని భూముల్ని ఆయన బంధువుల పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని బ్యాంకుల్లో రుణాలు పొందుతున్నారని వాపోయారు. అప్పుడు వైసీపీ అధికారంలో ఉండటంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికీ తామే సాగులో ఉన్నామని, పట్టాదారు పాసుపుస్తకాల్లో వలంటీరు బంధువుల పేర్లు ఎక్కించి బ్యాంకులో రుణాలు తీసుకుంటున్నారని వాపోయారు. సాగులో పట్టా రైతులు వుండగా ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లను ఎలా నమోదు చేస్తారని గ్రామ సర్పంచ్ వెంకటనాయుడు అధికారు లను ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని, డీఆర్వోకు నివేదికలను పంపి అర్హులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంజి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఆయన వీఆర్‌ఏలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో నారాలోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. పేస్కేల్, నామిని, జీతాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించి వీఆర్‌ఏలను ఆదుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వీఆర్‌ఏలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో వసంత్‌బాబుకు అందజేశారు.

ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

యల్లనూరు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండల సీఎస్ డీటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాజా శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్‌గా మునీంద్ర బాధ్యతలు చేపట్టారు. ఈయన బ్రహ్మసముద్రం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్‌గా ఉన్న మహబూబ్‌బాషా సెలవుపై వెళ్లడంతో వారిస్థానంలో వీరిని నియమించారు.

పుస్తకాల ప్రదర్శన

యాడికి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం యాడికి గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. పలు పాఠశాలల విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. గ్రంథాలయాధికారి మధుసూదన్ మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పోస్టర్ల విడుదల

గుంతకల్లు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ. పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, వసతి దీవెన వెంటనే విడుదల చేయాలన్నారు.



వెండి నాగాభరణం అందజేస్తున్న భక్తుడు

చిక్కణ్ణేశ్వరస్వామికి నాగాభరణం

కణేకల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన చిక్కణ్ణేశ్వర స్వామికి స్థానిక భక్తుడు శేషారెడ్డి వెండి నాగాభరణాన్ని శుక్రవారం సమర్పించారు. మొదట ఆలయంలో ఆయన ప్రత్యేకపూజలు చేయించారు. అనంతరం ధర్మకర్త ప్రసాద్‌రెడ్డికి రూ. రెండు లక్షల విలువైన 2.16 కిలోల నాగాభరణాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, అర్చకులు పాల్గొన్నారు.